ఆ జలం.. గరళం

'మేహాద్రి రిజర్వాయర్ వచ్చి దాదాపు 40 ఏళ్లు కావస్తుంది. పదేళ్ల క్రితం వరకు పశువులను మేతకు తోలుకెళ్లి రిజర్వాయర్‌లో నీటిని నేరుగా తాగేవాళ్లం.. ఏ ఇబ్బందీ ఉండేది కాదు.. కానీ, నేడు రిజర్వాయర్‌లో నీటిని చూస్తే భయం వేస్తోంది..పశువుల కాళ్లు.. కోడి శరీరభాగాలు.. మురుగు నీరు దర్శనమిస్తున్నాయి.. నీటిని తాగడానికి కాదు కదా తాకడానికి కూడా భయంగా ఉంది.. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో జనం విషపు నీటినే తాగాలి

- పెందుర్తి మండలం రాంపురానికి చెందిన ఓ పాడిరైతు మనోగతం

- ముంచుకొస్తున్న 'మేహాద్రి' ముప్పు
- రిజర్వాయర్‌లో కలుస్తున్న విషపూరిత పదార్థాలు
- అందులోనే పశువులు, కోళ్ల కళేబరాలు
- గ్యాలన్ల కొద్దీ చేరుతున్న మురుగు నీరు
- నగరవాసులకు కలుషిత నీరు


మేహాద్రి రిజర్వాయర్‌కు దాదాపు 200 మీటర్ల దూరంలో ప్రధాన కాలువ ద్వారా రిజర్వాయర్‌కు చేరుతున్న మురుగు నీరు


రిజర్వాయర్ సమీపంలో చింతలగ్రహారం వంతెన వద్ద ఇష్టానుసారం పడేస్తున్న పశువులు, కోళ్ల కళేబరాలు, విషపూరిత వ్యర్థాలు

పెందుర్తి: ఒకప్పుడు స్వచ్ఛతకు మారుపేరుగా ఉన్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ ప్రమాదకరరీతిలో కలుషితమవుతోంది. నగరంలో మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చే ముఖ్యోద్దేశంతో నిర్మించిన మేహాద్రి రిజర్వాయర్ మురుగు నీటికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సాధారణ చెత్తతో పాటు అత్యంత ప్రమాదకరమైన పశువులు, మేకలు, కోళ్లు, కుక్కలు, ఇతర జంతువుల కళేబరాలు రిజర్వాయర్ లోనే కలుస్తున్నాయి. మేహాద్రి పరీవాహక ప్రాంతంలోని ప్రజల వాడుక నీరంతా రిజర్వాయర్‌లోకే చేరుతోంది. ఈ క్రమంలో లక్షలాది మంది ప్రజల దాహార్తిని తీర్చే మేహాద్రి గంగ గరళంగా మారుతుంది.

మహా మేహాద్రి

దాదాపు 40 ఏళ్ల క్రితం నగరం విస్తరిస్తున్న తరుణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మేహాద్రి రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం, నరవ, చింతగట్ల, పెదగాడి, చింతలగ్రహారం, రాంపురం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలను రిజర్వాయర్ కోసం రైతులు వదులుకున్నారు. మేహాద్రి ఏర్పడిన తరువాత నగరంలోని దాదాపు మూడో వంతు ప్రజల దాహార్తిని తీర్చడంతో పాటు పలు కంపెనీల అవసరాలను కూడా తీరుస్తోంది. నగరం రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో మేహాద్రికి ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. ఇలా నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న తాటిపూడి, రైవాడల సరసన మేహాద్రి కూడా చేరింది. ఈ నీటిని తీసుకుంటున్న జీవీఎంసీ దాన్ని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తోంది.

పర్యవేక్షణ ఏదీ?

మేహాద్రి రిజర్వాయర్‌పై యంత్రాంగం పర్యవేక్షణ దాదాపు కొరవడింది. మైదాన ప్రాంతాల్లోని వర్షపు నీటిని చిన్నాపెద్దా కాలువలు దాదాపు పది కలిసి మేహాద్రికి చేరుస్తాయి. ఇటు పెందుర్తి రైల్వే వంతెన సమీపం నుంచి చింతలగ్రహారం ప్రధాన కాలువ ద్వారా.. అటు సబ్బవరం బొర్రమ్మగెడ్డ ద్వారా అధికశాతం నీరు మేహాద్రికి వస్తుంది. ఆయా కాలువలే ప్రస్తుతం నీటి కలుషితానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల నుంచి పశువులు, కోళ్ల వ్యర్థాలతో పాటు ప్రజలు వాడుతున్న మురుగు నీరు ఈ కాలువల్లోకే విడిచిపెడుతున్నారు. దీంతోపాటు చింతలగ్రహారం సమీపంలోని రిజర్వాయర్ ప్రధాన కాలువలో నిత్యం టన్నుల కొద్దీ చెత్త వేస్తున్నారు. ఆ చెత్తాచెదారం, విషపూరిత వ్యర్థాలు మురుగు నీటితో కలిసి రిజర్వాయర్ గర్భానికి చేరుకుంటున్నాయి. దీంతోపాటు రిజర్వాయర్ మొత్తం పూడికతో పేరుకుపోయింది. ఇలా అన్నిరకాలుగా రిజర్వాయర్‌ను యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెతున్నాయి. రిజర్వాయర్‌లో నీరు ఇంతటి ప్రమాదకరంగా మారినా పట్టించుకోకపోవడం ఏంటన్న ఆక్షేపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మేహాద్రి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మేహాద్రి గెడ్డ రిజర్వాయర్

విస్తీర్ణం: దాదాపు 15 వేల ఎకరాలు

రిజర్వాయర్ నుంచి జీవీఎంసీ నిత్యం తీసుకుంటున్న నీరు : 8–10 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ)

శుద్ధి కేంద్రం : మిందీ వద్ద ఉన్న నీటి శుద్ధికేంద్రంలో శుద్ధి చేస్తారు.

సరఫరా: గాజువాక, కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంట్, భెల్ ప్రాంతాలకు జీవీఎంసీ సరఫరా చేస్తుంది.

నీరు కలుషితానికి కారణాలు: చెత్త చెదారం వేయడాన్ని నిరోధించకపోవడం, మేహాద్రి పరీవాహక ప్రాంతంలో అనధికారిక నిర్మాణాలు, పంచాయతీల్లో అనధికారిక అనుమతులు ఇవ్వడం (ఆయా నిర్మాణాల నుంచి వ్యర్థాలు/మురుగు నేరుగా రిజర్వాయర్‌కు చేరుతున్నాయి), ఎప్పటికప్పుడు రిజర్వాయర్‌ను నిబంధనల ప్రకారం శుద్ధి చేయకపోవడం, దాదాపు 15 ఏళ్ల నుంచి రిజర్వాయర్‌లో పూడిక తీయకపోవడం

క్లుప్తంగా

కోల్‌కతా ఘటనపై ఐద్వా నిరసన

పరవాడ: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అతి కిరాతకంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఐద్వా సభ్యులు గొర్లివానిపాలెం వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు మాణిక్యం మాట్లాడుతూ ప్రాణాలు పోసే వైద్యులకు భరోసా కరువైందన్నారు. మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందనడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలన్నారు. వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి చంపిన కిరాతకులను కఠినంగా శిక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'కౌశిక'కు అభినందన


సాధించిన ట్రోఫీతో కౌశిక

పరవాడ: తానాం గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.కౌశిక యోగాలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 15న మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జెండావందన కార్యక్రమంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆమెను అభినందించారు. కొణతాల ఆమెకు రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. కౌశిక తల్లి ఆదిలక్ష్మి గృహిణి కాగా, తండ్రి సత్యనారాయణ కారుడ్రైవర్‌గా పని చేస్తున్నారు.

రాంగ్ పార్కింగ్‌పై కొరడా


సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరిమానాలు రాస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మమత


గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలపై ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కొరడా ఝులిపించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, ఇక్కడి పార్కింగ్‌లో కాకుండా బయట వాహనాలు పెట్టి రెండు మూడు గంటల వరకు రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ లోపలికి వెళ్లే దారిలేక వారి పడుతున్న ఇబ్బందులను చూసి ఎస్‌ఐ మమత రాంగ్ పార్కింగ్ వాహనాలకు జరిమానాలు విధించారు. స్టేషన్ పరిధిలో ఎక్కపడితే అక్కడ వాహనాలు నిలపరాదని, తప్పనిసరిగా పార్కింగ్‌లో ఉంచుకోవాలని ఆమె సూచించారు. కానిస్టేబుల్ సోనాలి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ 6 టెక్నాలజీపై అవగాహన


శిక్షణా శిబిరంలో పాల్గొన్న మెకానిక్‌లు

గాజువాక : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల మేరకు నూతనంగా విడుదలైన భారత్ స్టేజ్ (బీఎస్) 6 ద్విచక్ర వాహనాలపై టూవీలర్ మెకానిక్‌లకు అవగాహన కల్పించారు. ప్రగతి టూవీలర్ మెకానిజం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి బీఎస్6 సాంకేతికతను వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్ టి.ఆర్.ఆనంద్‌బాబు, అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదరరావు, తుంగ్లాం శ్రీను, రెడ్డిపిల్లి రాజు, పి.నాయుడు, ఎస్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్ నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు కనులపండువగా జరిగాయి. హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

సేంద్రియ ఎరువుల పంపిణీ


రైతులకు సేంద్రియ ఎరువులు అందజేస్తున్న రాంకీ ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ మహేంద్రబాబు

పరవాడ : సేంద్రియ సాగుతోనే వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని రాంకీ ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ మహేంద్రబాబు సూచించారు. మండలంలోని రావాడ గ్రామంలో రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రీ సస్టేనబిలిటీ సహకారంతో రైతులకు సేంద్రియ ఎరువులు ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలోని 98 మంది రైతులకు ఒక్కో ఎకరాకు 4 బస్తాలు చొప్పున 100 ఎకరాలకు 400 బస్తాల సేంద్రియ ఎరువులు అందజేశారు. అనంతరం రావాడ సర్పంచ్ మాటూరి సన్యాసినాయుడు మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ వారు సేంద్రియ వ్యవసాయ కార్యక్రమానికి రావాడ గ్రామాన్ని ఎంపిక చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. రైతులంతా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పరవాడ మండల వ్యవసాయ అధికారి సీహెచ్ చంద్రావతి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, కె.శ్రీనివాసరెడ్డి, గ్రామ పెద్దలు వియ్యపు చిన్న, కోన రామారావు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు


ఏఈవో నరసింగరావుకి చెక్కు అందజేస్తున్న మహంతి వెంకటలక్ష్మి ప్రతినిధులు


సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కు అందజేస్తున్న చెక్క రాజు, ప్రసాద్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి ప్రతినిధులు లక్ష 116 రూపాయాల విరాళాన్ని, దాబాగార్డెన్స్‌కి చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి


పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, తదితరులు

పెందుర్తి : కోల్‌కతాలో విధి నిర్వహణలో ఉన్న ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటనపై పెందుర్తిలో ఆదివారం నిరసన జ్వాల ఎగసింది. జరిగిన ఘటనను ఖండిస్తూ బాధితురాలికి సంఘీభావంగా నాలుగు రోడ్ల కూడలిలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు, స్థానిక ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీను మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండే వైద్యులు, సిబ్బందికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యుల కోసం జాతీయ స్థాయిలో రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల కరస్పాండెంట్ మంగిరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు ఉమాశంకర్, నవీన్, చిరంజీవి, గణేష్, సునీత, వినయ్, సూర్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళానైపుణ్య పోటీలు



పాట్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఓ విద్యార్థిని తయారు చేసిన కళాకృతి

కొమ్మాది: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన కళా నైపుణ్య పోటీలకు విశేష స్పందన లభించింది. నగరం నలుమూలల్లోని అనేక పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్‌లో వైభవంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం అనేక ఆకర్షణీయమైన పోటీలు నిర్వహించామని తెలిపారు. పాట్ పెయింటింగ్, వ్యాసరచన, డ్రాయింగ్, శ్రీకృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోకాల పారాయణం, వంట, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించామని, విజేతలకు కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి


యానిమల్ కీపర్‌కు దూరంగా పరుగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గెంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.

జేసీఐ విశాఖ అచీవర్స్ సెమినార్


సెమినార్‌లో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఓ హోటల్‌లో జేసీఐ విశాఖ అచీవర్స్ నేతృత్వంలో ఆదివారం ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. విశాఖ జోన్ ప్రెసిడెంట్ సురేష్ గొంప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు సేవలు ఏ విధంగా గుర్తించాలి? అవార్డులు ఎలా ఎంపిక చేయాలనే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. మేనేజ్‌మెంట్ జెడ్ డి.రూప సిరిపూరి మాట్లాడుతూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించడంతోపాటు అవార్డులు అందుకునే స్థాయికి ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశంపై జేసీఐ అచీవర్స్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీఐ వైస్ ప్రెసిడెంట్ అనురాధ్ సిస్టలా, జోనల్ చైర్‌పర్సన్ సింధూర తాడి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమశేఖర్, బి.దిలీప్‌కుమార్, రంజిత్ షా, డాక్టర్ శీతల్ మదన్, ఉమా, శ్రీదేవి, విజయ కిరణ్, పర్వీన్, చంద్రశేఖర్, ప్రేరణ మదన్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడాయి. తీరంలో ఇసుక తిన్నెలపై వాలీబాల్, క్రికెట్, కబడ్డీ వంటి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం సముద్ర స్నానాలు చేసి ఇంటి ముఖం పట్టారు. - పరవాడ

అనుబంధాల వేడుకకు సిద్ధం



ఎన్ఏడీలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు


ఎన్ఏడీ జంక్షన్‌లో రాఖీ స్టాల్


గోపాలపట్నం స్వీట్స్ షాప్‌లో జనం సందడి

మార్కెట్‌కు రాఖీ పండగ శోభ

విశాఖ విద్య/గోపాలపట్నం: అక్కా–తమ్ముడు.. అన్నా–చెల్లెళ్ల ఆప్యాయతలను పంచుకునే పండగ రానేవచ్చింది. సోదర ప్రేమకు చిహ్నంగా రాఖీ కట్టడం అనాదిగా వస్తోంది. తండ్రి తరువాత ఆ స్థానంలో తమకు తోడుగా నిలిచే సోదరుడు ఆరోగ్యం మెండుగా ఉండాలని కోరుకునే అక్కచెల్లెమ్మలు రాఖీలు కట్టేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో మార్కెట్‌లో సందడి కనిపించింది. సామాజిక మాధ్యమం జోరు మీద ఉన్నప్పటికీ, యువతలో ట్రెండ్ మారుతుందనే చెప్పాలి. వాట్సాప్...ఫేస్‌బుక్‌లో రాఖీ శుభాకాంక్షలు చెప్పే కంటే, తామే స్వయంగా వెళ్లి తన సోదరుడి చేతికి రాఖీ కట్టాలనే తపన అక్కచెల్లెమ్మల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మార్కెట్‌లో రాఖీ విక్రయాల దుకాణాలు విరివిగా వెలిశాయి. రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్ఏడీ సెంటర్, బాజీ జంక్షన్, గోపాలపట్నం, కరాస, మర్రిపాలెంలో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన రాఖీ విక్రయాల స్టాళ్ల వద్ద ఆదివారం మహిళలు సందడి చేశారు. స్వీట్స్ దుకాణాల్లో మిఠాయిలు కొనుగోలు చేసేందుకు జనం ఎగబడ్డారు. రూ.10 నుంచి రూ.350 వరకు రాఖీలు విక్రయిస్తున్నామని ఓ దుకాణదారుడు తెలిపాడు. సోమవారం విక్రయాల జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. స్వీట్స్ దుకాణాల్లోనూ నోరూరించే మిఠాయిలను సిద్ధం చేశారు.

వైభవంగా పోలమ్మవారి పండగ


అమ్మవారి పుట్టమన్నును తలపై పెట్టుకుని తీసుకొస్తున్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హరిజన వీధిలో కొలువైన పోలమ్మ అమ్మవారి పండగను ఆదివారం స్థానికులు వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు, పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. ఆలయం నుంచి మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ ఎదురుగా గల మైదాన ప్రదేశం వరకు భక్తులు ఊరేగింపుగా వెళ్లి అక్కడ పుట్టమన్ను తీసుకొచ్చి తల్లి పీఠం వద్ద ఉంచి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ పండగ మూడు రోజుల పాటు జరుగుతుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కావాలనే 'ఉక్కు' నిర్వీర్యం

అగనంపూడి: విశాఖ ఉక్కు స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల ఆస్తిగా భావిస్తున్నామని, లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే సంస్థను కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చిన వారికి కట్టబెట్టాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని జీవీఎంసీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగఫలితం విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని భావిస్తే ఛీత్కారం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం లాభాలతో పయనించిన విశాఖ ఉక్కును పరిపరి విధాలుగా ఇబ్బందులకు గురిచేసి నేడు ఉత్పత్తిని హీనస్థితికి తీసుకువెళ్లడం, కేవలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికేనని ప్రజలకు తెలుసన్నారు. ముడి సరుకును సరఫరా చేయకుండా చివరికి ఉత్పత్తి నిలిపివేసే స్థితికి తీసుకువెళ్లడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముడిసరుకు సరఫరా చేసి సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా మూడువేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామారావు, శ్రీనివాసరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం తీరం వద్ద ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. దాసరి రఘురాం అనే వ్యక్తి వాకింగ్ చేస్తుండగా ఈ ప్రాంతంలో తీరం వద్ద నల్ల ప్యాంట్, ఎరుపు, నలుపు గల టీ షర్టుతో (సుమారు 35 నుండి 40 సంవత్సరాలు) వ్యక్తి మృత దేహం కనిపించింది. వెంటనే ఆయన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ డి.రమేష్ సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.